క్లుప్తంగా

అర్హులందరికీ ‘తల్లికి వందనం’ అందించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు మాణిక్యం

పరవాడ: తల్లికి వందనం పథకం అమలులో విద్యుత్ బిల్లు 300 యూనిట్లు వస్తే పథకం వర్తించదన్న నిబంధన శోచనీయమని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షులు పి.మాణిక్యం ఆక్షేపించారు. పరవాడలో గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన తల్లికి వందనం పథకంలో చాలా మంది తల్లుల ఖాతాలకు డబ్బులు జమ కాలేదన్నారు. పథకం వర్తించిన వారి కంటే అనర్హుల జాబితాయే చాలా ఎక్కువగా ఉందన్నారు. వీరిలో అత్యధికులకు కరెంట్ బిల్లు 300 యూనిట్లు కంటే ఎక్కువ చూపుతోందన్నారు. ఇలాంటి వారిలో దాదాపు అందరికీ కరెంట్ బిల్లుల వివరాలు తప్పుగానే నమోదైనట్లు మహిళలు చెప్పున్నారని పేర్కొన్నారు. ఎవరెవరి ఆధార్ నంబర్‌తో ఉన్న రీడింగ్‌ను వారి పేరిట చూపిస్తున్నట్లు తెలిపారు. పథకం అమల్లో ప్రభుత్వ నిబంధల వల్లే చాలా మంది అనర్హులయ్యారని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లు నిబంధనను సడలించి, అర్హులైన ప్రతి తల్లికి పథకం లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ఐద్వా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అన్నపూర్ణ, బంగారమ్మలు పాల్గొన్నారు.

తుప్పలు తొలగించారు



కలపాకలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తొలగించిన తుప్పలు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: మండలంలోని కలపాక గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలను విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. ఈ నెల 9న సాక్షిలో ‘ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తుప్పలతో తిప్పలు’ శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. గ్రామంలో తుప్పల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. దీనిపై సాక్షిలో కథనం ప్రచురితమవడంతో సిబ్బంది చర్యలకు దిగారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, తుప్పల్ని తొలగించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లే మార్గం సుగమమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న నాయకులు, భక్తులు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. స్వామిని గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, ఆలయ కమిటీ చైర్మన్ లాలం అప్పలనాయుడు, ఓలిశెట్టి అప్పలరాజు, స్థానిక నాయకులు కూండ్రపు శ్రీరామ్మూర్తి, కొరంగి అప్పలరాజు, కిలపర్తి అప్పలనాయుడు, సమ్మెంగ సోమేశ్వరరావు, ఈరుగుల ప్రసాద్, భక్తులు దర్శించుకుని పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారీగా జనసమీకరణ



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

పెందుర్తి: బీచ్‌లో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి నియోజకవర్గం నుంచి భారీగా జనాన్ని తరలించాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. అధికారులు, కూటమి నాయకులు సమన్వయం చేసుకుని ప్రజలందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని సూచించారు. సుజాతనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో గురువారం యోగాంధ్ర జనసమీకరణపై ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయాల వారీగా జనాన్ని సమీకరించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి కార్యక్రమానికి తరలించి, తిరిగి ఇళ్లకు క్షేమంగా చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జెడ్పీ హేమావతి, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో జాడలేని చెత్తశుద్ధి

పల్లెలు దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు అంటారు. అలాంటి పల్లెల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. రోగాలు ప్రబలి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్బవరం మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. స్వచ్ఛతా హీ సేవా పేరిట నాయకులు, అధికారుల హడావుడి తప్ప, క్షేత్రస్థాయిలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఎక్కడికక్కడే చెత్త కుప్పలు.. దుర్గంధంలో పరిసరాలు
- అలంకారప్రాయంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- పూడుకుపోయిన కాలువలు.. రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- వర్షాకాలంలో సీజనల్ రోగాల భయంలో ప్రజలు



గొటివాడ కాలనీలో సీసీ రోడ్డు పక్కన చెత్తకుప్ప

సబ్బవరం మండల వివరాలు

గ్రామ పంచాయతీలు	మండల జనాభా
24	67 వేలు

సంపద తయారీ కేంద్రాలు: 24



సబ్బవరం దుర్గాలమ్మ ఆలయం వద్ద డ్రైన్‌లు లేకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిన మురుగునీరు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో చెత్త కుప్పలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. పారిశుధ్య నిర్వహణలో అధికారులలో చిత్తశుద్ధి లోపించడం, పారిశుధ్య సిబ్బంది నిర్లిప్త వైఖరితో ఊరూరా అపారిశుధ్యం తాండవిస్తోంది. రోగాలు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మురుగు సమస్య అధికం



సబ్బవరంలో మురుగునీటి సమస్య అధికంగా ఉంది. వీటితో పాటు వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తే మురుగు సమస్యను అధిగమించవచ్చు. దీనికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని, సమస్యను పరిష్కరించాలి

-సింగంపల్లి వెంకటరావు,జోడుగుళ్ల జంక్షన్, సబ్బవరం గ్రామం

పారిశుధ్య మెరుగుకు చర్యలు



మండలంలో పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తాం. చాలా గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో అన్నిరకాల వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకొచ్చాం. వర్షాకాలం రావడంతో అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు మురుగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

-బి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం మండలం

మురికి కూపాలుగా గ్రామాలు

- మండలం కేంద్రం సబ్బవరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఉన్న కొద్దపాటి కాలువలు సైతం వ్యర్థాలతో పూడుకుపోయాయి. దీంతో రోడ్లపై మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది.
- సాయినగర్ కాలనీ నుంచి సబ్బవరం పోలీస్ స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైన్‌లు లేవు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్డు పొడవునా ప్రవహించి రోడ్డుకు ఇరువైపులా ఉండే లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోతుంది. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఈ మురుగు అధికంగా నిలిచి, చిన్నపాటి వర్షానికీ మురుగు ముంచెత్తుతోంది.
- సబ్బవరం మూడురోడ్ల కూడలిలో డ్రైన్‌లకు కాలం చెల్లడంతో మురుగునీటి ప్రవాహం ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. చాలా చోట్ల కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ఆయా ప్రాంతాల్లో కాలువలు పూడుకుపోయాయి. దీంతో వాడుక నీరు, వర్షపు నీటి ప్రవాహానికి రోడ్లే గతవుతున్నాయి.
- మండల శివారు ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను కుప్పలుగా వేస్తున్నారు. గొర్లివానిపాలెం సమీపంలోని లా యూనివర్సిటీకి వెళ్లే రోడ్డులో అధికంగా ఈ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. గొర్లివానిపాలెం నుంచి వంగలి వెళ్లే రోడ్డులో కేజీబీవీ సమీపంలో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చే చెత్తను రోడ్డు పక్కనే వేస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు తీసుకెళ్లాల్సిన పారిశుధ్య సిబ్బంది కనీస చర్యలు తీసుకోవట్లేదు.
- గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. ఇంటింటా చెత్తను సేకరించి, ఈ కేంద్రాలకు తరలించే సిబ్బంది లేకపోవడంతో కేంద్రాల నిర్వహణ గాలికొదిలేశారు. ఉన్నతాధికారుల పర్యటన సమయంలో హడావుడి చేసి, ఆ తర్వాత పట్టించుకోవట్లేదు.
- మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో రోడ్లకు ఇరువైపులా కొంత మేర డ్రైన్లను ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో విస్తరించకపోవడంతో మురుగునీరు కాలువ శివార్లలో నిలిచిపోతోంది. ఆయా పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో గ్రామాలు మురికికూపాలుగా మారుతున్నాయి.
- అధికారులు శనివారం నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రచారానికే పరిమితమవుతోంది. కింది స్థాయి సిబ్బంది, అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడటంతో.. ఆశించిన స్థాయిలో పారిశుధ్య నిర్వహణ జరగట్లేదన్న ఆక్షేపణలున్నాయి.



సబ్బవరం మూడు రోడ్ల కూడలి నుంచి విశాఖ రోడ్డులో డ్రైనేజీ లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

లైంగిక వేధింపుల నిరోధకం చట్టంపై అవగాహన

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పరవాడ సిన్క్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేటు లిమిటెడ్ సిబ్బందికి వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి చట్టాల్లో వివిధ సెక్షన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాధనంతో కూటమి చోటా నేతల అడ్డగోలుతనం

- 95వ వార్డులో ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియకుండా శంకుస్థాపనలు
- 88వ వార్డు జీవీఎంసీ నిధులతో ప్రైవేట్ స్థలంలో బోర్‌వెల్
- టీడీపీ, జనసేన నాయకుల తీరుపై 95వ వార్డు బీజేపీ అధ్యక్షుడి ధ్వజం



95వ వార్డు రోడ్డు శంకుస్థాపనలో చోటా నేతలు



88వ వార్డు నరవలో జీవీఎంసీ నిధులతో మంజూరైన బోర్‌వెల్‌ను ప్రజలకు అందుబాటులో లేని ప్రైవేట్ భూమిలో వేస్తున్న జనసేన టీడీపీ నాయకులు

పెందుర్తి: అధికార కూటమి చోటామోటా నాయకుల ప్రచారార్భాటం అదుపు తప్పుతోంది. ప్రొటోకాల్ నిబంధనలను పక్కన పెట్టి ప్రజాధనంతో ఇష్టానుసారం పనులతో నానా యాగీ చేస్తున్నారు. ఎమ్మెల్యే మాట దెవుడెరుగు స్థానిక కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి మరీ బిల్డప్‌లు ఇస్తున్నారు. చివరకు కూటమి భాగస్వాములతోనే చీవాట్లు తింటున్నారు. గురువారం పెందుర్తి పట్టణ ప్రాంతంలో జరిగిన రెండు సంఘటనలు కూటమి నాయకుల ప్రచార పటాటోపాన్ని తేటతెల్లం చేశాయి.

ప్రజాప్రతినిధులా.. వాళ్లెవరు?

జీవీఎంసీ 95వ వార్డు శివగాయిత్రినగర్‌లో రోడ్డు నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలు నోటిఫికేషన్‌తో పనులు ఆగిపోయాయి. తాజాగా ఆయా పనుల చేపట్టాలని జీవీఎంసీ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే రోడ్డు పనుల శంకుస్థాపన ప్రొటోకాల్ ప్రకారం మేయర్, స్థానిక కార్పొరేటర్ చేయాలి. వారికి తీరికలేకపోతే వారి సూచనలతో అధికారులు పనులకు శ్రీకారం చుట్టాలి. కానీ వార్డులోని జనసేన నాయకుడు కంచిపాటి మధు, టీడీపీ నాయకుడు దాట్ల మధు ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన చేసేశారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన వార్డులోని బీజేపీ నాయకులు టీడీపీ, జనసేన నాయకులపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్, స్థానిక కార్పొరేటర్‌కు కనీసం సమాచారం లేకుండా ఇవేం పనులంటూ బీజేపీ 95, 97వ వార్డుల అధ్యక్షుడు చిక్కాల సతీష్ మండిపడ్డారు. తమ కార్పొరేటర్ ముమ్మన దేముడు(వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచి బీజేపీలో చేరారు) రోడ్డు కోసం నిధులు తెస్తే, మీరు శంకుస్థాపన చేస్తారా? అంటూ ధ్వజమెత్తారు.

ప్రైవేట్ స్థలంలో బోర్‌వెల్

జీవీఎంసీ 88వ వార్డు నరవలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు దాదాపు రూ.3 లక్షలతో రెండు చేతి పంపుల(బోర్ల)ను జీవీఎంసీ మంజూరు చేసింది. ఇందులో ఒకటి నరవ శివారులో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద వేశారు. రెండోది గ్రామంలో ప్రజలకు అందుబాటులో వేయకుండా స్థానిక కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు సూచనలతో ఓ ప్రైవేట్ భూమిలో వేశారు. దీని ప్రారంభోత్సవానికి స్థానిక టీడీపీ, జనసేన నాయకులు హాజరయ్యారు. ఈ క్రమంలో వీరు తమ ప్రచారం కోసం ‘పొలంలో బోర్ వేసిన జనసేన, టీడీపీ నాయకులు’అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం చూసి నరవ ప్రజలు విస్తుపోయారు. ప్రజలకు పనికొచ్చిన చోట వేయకుండా జిరాయితీ భూముల్లో బోర్ తవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ ఏఈ కేదార్‌నాథ్‌ను వివరణ కోరగా స్థానిక కార్పొరేటర్, కూటమి నాయకుల సూచనల మేరకే నరవలో బోర్లు తవ్వినట్లు చెప్పడం గమనార్హం.

గృహ సర్వే పొరపాట్లతో సంక్షేమ పథకాలపై వేటు

- ఆ తప్పుల్ని ప్రభుత్వమే సరిదిద్దాలి
- సబ్బవరం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్
- అనధికార విద్యుత్ కోతలు, లో ఓల్టేజీపై సభ్యుల ధ్వజం



విద్యుత్ కోతలపై సభ్యులకు వివరిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ అశోక్

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేసిన ఇంటింటి(సాధికార) సర్వేలో తప్పుల్ని సరిచేయకుంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులు దూరమవుతారని మండల పరిషత్ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో సభ్యులు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన సాధికార సర్వే, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన గృహ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాల ఆన్‌లైన్ నమోదులో దొర్లిన పొరపాట్లను సరి చేయాలన్నారు. ఈ తప్పుల వల్ల చాలా మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. దీనిపై తీర్మానం ఆమోదించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో పద్మజ తెలిపారు.

డంపింగ్ యార్డు లేకపోవడంతో..

సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు మాట్లాడుతూ తమ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే అవకాశం లేకుండా పోయిందన్నారు. గతంలో ఉపయోగించిన డిగ్రీ కళాశాల సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను మార్చాలని జిల్లా అధికారులు ఆదేశించడంతో ప్రస్తుతానికి ఏ గ్రామంలో చెత్త ఆ గ్రామంలోనే నిల్వ చేస్తున్నామన్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ అసకపల్లి సర్వే నెంబర్ 1లో, చిన్నయ్యపాలెం సమీపంలోను స్థలాలను గుర్తించామని, త్వరలో స్వాధీనం చేసుకుని డంపింగ్‌యార్డుకు కేటాయిస్తామన్నారు.

- మండలంలో అనధికార విద్యుత్ కోతలు, లో ఓల్టేజ్ సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులను సభ్యులు నిలదీశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ విద్యుత్ సరఫరాలో ఎక్కువ సమయం అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిసినప్పుడు ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు.
- పోలవరం కాలువ విస్తరణ భూ సేకరణలో భాగంగా డి ఫారం, అసైన్డ్ భూముల రైతులకు పరిహారంపై నల్లరేగులపాలెం సర్పంచ్ రామకోటి అప్పారావు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు.
- ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వట్లేదని అసకపల్లి ఎంపీటీసీ కర్రి అప్పారావు ఆరోపించారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, ఐసీడీఎస్ సీడీపీవోలు ఆయా శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించేటప్పుడు విధిగా సమాచారం అందించాలని తీర్మానించారు.
- వీటితోపాటు నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యాన, గృహ నిర్మాణ, విద్య, పశు సంవర్ధక, మాతా శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఆయా శాఖల పనితీరు, పురోగతిపై సమీక్షించారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీలక్ష్మీరాణి, ఎంపీడీవో పద్మజ, డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మణరావు, రవీంద్రబాబు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు, స్వాగతం



టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, బదిలీపై వచ్చినన ఉపాధ్యాయులకు స్వాగత కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. పాఠశాల హెచ్ఎం, ఎంఈవో-2 ఎంజే రవీంద్రబాబు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఇటీవల టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు పొందిన ఎస్.గౌతమి, పి.గ్రీష్మంత్, ఎస్.చైత్రకు నగదు బహుమతులు అందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎంలు వి.శ్రీనివాస్, సీహెచ్ రమేస్, బొడ్డేటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

‘యోగాంధ్ర’ బస ఏర్పాట్ల పరిశీలన

సబ్బవరం: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖ వేదికగా ప్రధాని మోదీ పాల్గొనే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ సూచించారు. మండలంలో యోగా సాధకులకు ఏర్పాటు చేసిన వసతి కేంద్రాలను ఆయన సీఐ రామచంద్రరావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. చోడవరం, చీడికాడ, కోటపాడు మండలాల నుంచి 2,892 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రికి సబ్బవరం చేరుకుంటారని తెలిపారు. వారందరికీ పాఠశాలలు, కళాశాలలు, కళ్యాణ మండపాలు వంటి 11 చోట్ల వసతి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇన్‌చార్జులదేనన్నారు. 21 వేకువ జామున వారికి నిర్దేశించిన ప్రదేశానికి చేరుకునేలా 63 బస్సులను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ సీహెచ్ అప్పారావు, రీసర్వే డీటీ గణపతి, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్ఐ వీరయ్య తదితరులు ఉన్నారు.

నృత్త కరణ యోగా









యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో చినముషిడివాడలోని నిర్మలా నృత్య నికేతన్ కళాకారులు వినూత్న ప్రదర్శనతో అబ్బుర పరిచారు. స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యునెస్కో గుర్తింపు పొందిన ‘నాట్యశాస్త్రం’లో భరతముని వివరించిన 108 నృత్త కరణాలతో యోగాసనాలు మిళితం చేసి కళాకారులు ప్రదర్శించారు. నటరాజ ఆసనం, నాగాపసర్పిత, శకటాస్య, చక్రమండలం, లలాట తిలకం, అర్గళ, కూర్మాసనం వంటి విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ప్రముఖ నృత్య గురువు డాక్టర్ బి.విజయజ్యోతి సారథ్యంలో జరిగిన ఈ ప్రదర్శనను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. - పెందుర్తి